


# సావుబతుకు

ఆప్త చైతన్య

కళ్ళాపు చల్లి గట్టి చేసిన విశాలమైన వాకిళ్ళలో అంతా మంచాలేసుకున్నారు.

వేసవి రాత్రులు ... వెన్నెల వెలుగు ... చల్లని గాలిలో సేద దీరుతోంది చోళపదం.

కొంతమంది అప్పటికే గురకపెట్టి నిద్రపోతుంటే మరికొంత మంది అడ్డపొగలేసి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళకు కాస్తంత దూరంలో ఓ పోతుల బండి అప్పల్నాయుడు ఇంటివైపు సాగిపోతోంది. బండిమీద పారయ్య కూచున్నాడు. సిమ్మాలు బండి ముందు నడుస్తున్నాడు.

అప్పల్నాయుడు సిమ్మాలు కోసమే ఎదురు చూస్తూ గడపలో కూచున్నాడు. వాకిట్లో బండి ఆగిన అలికిడికి అప్పల్నాయుడు లేచి బయటికొచ్చాడు.

"ఏట్రా సిమ్మాలు! ఇంతాలిస్సం సేస్సేవేటి ... రా రా ..." అని ఇంటి పెరడువైపు దారి తీశాడు అప్పల్నాయుడు.

సిమ్మాలు, పారయ్య అతన్ని అనుసరించారు.

పెరట్లో వున్న ఉద్దుల్ని పాలేర్లతో బండిలో వేయించాడు అప్పల్నాయుడు.

మూడు జతల ఉద్దులు ... బండి మీద పడీ సరికి దాపల పోతు ముందు కుడికాలిని పైకెత్తి దించింది. దానికి కాల సంచలొచ్చాయి.

"సిమ్మాలు! జాగర్తరా! ... యిదా ... నీ ఒంద రూపాయలు" అంటూ అప్పల్నాయుడు వంద నోటుని సిమ్మాలు కందించాడు.

అందుకొని రొండిని దోపుకున్నాడు సిమ్మాలు.

బండి బయల్దేరింది.

పారయ్య బండి మొకర మీద కూచొని పోతుల్ని తోల్తున్నాడు. సిమ్మాలు బండి ముందు నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

సిమ్మాలు చోళపదానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో వున్న రాంభద్రపురంలో వుంటున్నాడు. అతనికొక ఎకరం పొలం వుంది. అందులో పండుం

ఇత్తనాలు జల్లుకుంటే ఓ యిరవై బస్తాల ధాన్యం పండుతాయి. సమయానికి ఇత్తనాలు లేకపోతే వాళ్ళ వూరి షావుకారి దగ్గర అప్పు తీసుకున్నాడు. దుక్కులకి, ఆకు తీతకి, ఉడుపులకి, గాబుతీతకి ... పదిహేను వందల దాకా ఖర్చయ్యింది. 'పంట సేతికొచ్చేక తీరిసిద్దువులే' అని షావుకారే అప్పిచ్చాడు. ఇరవైయేం ఖర్మ పాతిక బస్తాల వరకు దిగుబడి రావలసిందే – అర్థాంతరంగా తుఫాను రాకపోతే. అందరికీ ఎంతో కొంత మిగిల్చిన తుఫాను సిమ్మాలుది గాడిపాలం అవ్వడం చేత మీద నుంచి పొంగుకొచ్చిన గెడ్డతో పంటమొత్తాన్ని ఊడ్చేసింది. అది ఏడుపు కాదు – కంటికి మంటికి ఏకధారే! సిమ్మాలు కళ్ళ ముందు చీకటి అలుముకోవడమే కాకుండా ఆ చీకట్లో పాము లాగ షావుకారి అప్పొకటి భయంకరంగా కనిపించింది. "పంటంతా పోయింది బతుకెలాగరా దేవుడా!' అని ఒక పక్క సిమ్మాలు ఏడుస్తుంటే మరో పక్క ఆ షావుకారి రామ్మందిరం కాడ పంచాయతీ పెట్టించేసి ఉన్నపళంగా అప్పు తీర్చీమన్నాడు. లేకపోతే 'పదో, పరకో తిరిగిత్తాను – పొలం రాసిచ్చీ' మన్నాడు. పెద్దలందరూ పాము చావకూడదు – కర్ర విరక్కూడదన్నట్లు ఒంటి మీద యిస్త్రీ బట్టలు నలక్కూడని మాటలాడేరు. సిమ్మాలు గుండె పగిలినంత పనయ్యింది. అతని కళ్ళముందు భార్య, పెళ్ళికెదిగిన కూతురు, ఇద్దరు కొడుకులు పంచాయతీ పెద్దలు వేసిన ప్రశ్నల్లాగ కనిపించాయి.

సిమ్మాలు బుర్ర మొద్దుబారిపోయింది. ఎంత ఆలోచించినా దారి కనిపించలేదు. అదే అదనుగా షావుకారి తొందరపెట్టాడు. మూడు నెలల గడువిమ్మన్నాడు సిమ్మాలు. మూడు నెలల్లో తీర్చలేకపోతే అలాగే పొలం రాసి చ్చెస్తానన్నాడు.

దానికీ పెద్దలంతా సరేనన్నారు.

'మూడు నెలల్లో సిమ్మాలెలాగ తీరుస్తాడ్లే' అని షావుకారీ"అలాగే"నన్నాడు.

అప్పల్నాయుడు సాయం చెయ్యకపోతే నిజంగా ఆ గడువులో సిమ్మాలు అప్పు తీర్చలేకపోను. అప్పల్నాయుడు పుణ్యమా అని ఇప్పుడు తీర్చగలుగుతున్నందుకు సంతోషంగా వుంది.

అప్పల్నాయుడు పెద్ద మోతుబరి ... దొంగతనంగా కలప రవాణా చేస్తుంటాడు. దానికి సిమ్మాలు లాంటి వాళ్ళను ఉపయోగించుకుంటాడు. ఉపయోగించుకున్నా ఫలితం మాత్రం బాగానే ముట్టజెబుతాడు. దూరాన్నిబట్టి వంద రూపాయలకు తక్కువ లేకుండా బండికి యిస్తుంటాడు.

రెండు నెలల పదిహేను రోజులు గడిచిపోయాయి.

షావుకారి బాకీ ఇంకా రెండు వందలు మిగిలిపోయింది.

మరో రెండుసార్లు తిరిగితే చాలు – బాకీ తీరిపోతుంది.

పారయ్య సిమ్మాలు తోడి రైతు. సిమ్మాలు ఎప్పుడు బండి పూసినా పారయ్య తోడొస్తుంటాడు

... ... ...

ఆలోచిస్తున్న సిమ్మాలు తేరుకొని పారయ్యతో అన్నాడు –

"ఒరే పారిగా! ఇంకో రొండు సుట్లు సాలా ... నువ్వీ రొండు సుట్లూ సాయింజేత్తే సాలా" అని.

"అదేటి మావ అలగంతవ్ ... రొండు సుట్లేటి ... ఒంద సుట్లైనా నీకు సాయింజెయ్యనానికి నాకేటి కట్టం సెప్మీ" అన్నాడు పారయ్య.

పారయ్య చూపిస్తోన్న అభిమానానికి సిమ్మాలు మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

"ఎహెయ్ ... ఎహెయ్ ..." పోతుల నదిలిస్తున్నాడు పారయ్య.

ఊరు దాటి గోర్జిలో కొచ్చింది బండి.

బండి కమ్మీల కింద కంకర కరకరలాడింది.

నడుస్తోన్న సిమ్మాలు వంద నోటుని దోపుకున్న రొండిని ఓసారి తడుముకున్నాడు.

తలెత్తి వెండిముంతలా తెల్లగా మెరిసిపోతోన్న చంద్రుడ్ని చూశాడు.

వాక పువ్వుల్లాంటి చుక్కల్ని చూశాడు.

పిల్లి ఎగబడినప్పుడు కుదురు మీద పాలబిడ్డి జారి ఒలికి దారకట్టిన పాలలాగ ఒంపులు తిరిగిపోతోన్న నాగావళి నదిని చూశాడు.

నాగావళి మీంచి సాగివచ్చిన చల్లని గాలిని గుండె నిండా పీల్చుకున్నాడు.

బండి శివాలయం దాటింది.

సిమ్మాలు మనసునిండా మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి.

పులిమీద పుట్రలాగ ఈ మధ్యనే బండి చక్రం తాలూకు రేకులు రెండు విరిగిపోయాయి. వడ్రంగి సాంబడ్ని ఎలాగో బతిమాలి పాత రేకులుంటె వేయించాడు.

రెండ్రోజుల్నుంచీ పోతులకీ ఒంట్లో బాగుండడం లేదు. దాపల పోతుకి కాల సంచలయితే ఎలపల పోతుకి పారుదు వ్యాధి. ఎన్ని మందులు వాడుతున్నా ఫలితం పెద్దగా కనిపించడం లేదు.

అయినా ఈ ప్రయాణం తప్పదు ... పోనీ ఎండయ్యని పోతులడుగుదాం అనుకుంటే సాయంత్రమే బండి పూసుకొని 'నీలావడి' యాత్రకు వెళ్ళిపోయాడు. మరెవ్వరూ అంతపాటి వాళ్ళు కాదు ...

శివాలయం దాటిన బండి ఇసుక పర్ర మీదికి సాగింది.

పోతుల నడక మందగించింది.

దాపలపోతు కాలిగిట్టల సందులో ఇసుక చొచ్చిన బాధకి కుంటింది.

ఎలపల పోతు కూడా నీర్సంగా అడుగులేస్తుంది.

పారయ్య పోతుల గమనాన్ని గమనించి బండి దిగి మొకర పట్టుకొని నడుస్తున్నాడు.

ఇక్కడ యేరు దాటితే మళ్ళీ దళాయిపేట వరకూ యేటిబ్బంది లేదు. యేటికి ఎడమ ప్రక్క నుంచే దళాయిపేట, సీమనాయుదువలస జంక్షన్ వరకు మట్టిరోడ్డుంది. దళాయిపేట యేటికి ఎడమ వైపు నుంటే కుడివైపు కళ్ళికోట వుంది. కళ్ళికోటకి సరాసరి రోడ్డు లేదు. తార్రోడ్డుంది గానీ అటు వెళ్తే ప్రమాదం. అందుకే యిలా దళాయిపేట వెళ్ళి యేరు దాటాలి.


నీట్లోంచి అవతలొడ్డుకి చేరుకుంది బండి.

ఒడ్డు ఎత్తుగా వుండడం వలన అక్కడ పోతు లాగిపోయాయి.

పారయ్య కేకలేసి పోతుల్ని అదిలించాడు ... లాభం లేకపోయింది.

"ఒరే పారిగా! ఎనక్కెల్లి పిత్తకోల్లొట్టుకుని తొయ్యిరా!" అన్నాడు సిమ్మాలు.

కమ్చీకర్ర సిమ్మాలుకిచ్చి వెనక్కెళ్ళాడు పారయ్య. ఇద్దరూ కలిపి అదిలించారు.



అప్పటికీ కదలకపోతే చేసేదిలేక, కష్టమైనా బండి మీద ఉద్దుల్ని దించి ఒడ్డు మీద వేసి బండి ఖాళీ చేశారు.

ఎలాగో మెల్లగ ఒడ్డెక్కింది బండి.

జబ్బు పడ్డ పోతులు భారంగా బండిని లాగుతుంటే సిమ్మాలు గుండె రోట్లో దంపుడైపోయింది.

ఒడ్డు మీదేసిన ఉద్దుల్ని మళ్ళీ బండి మీద కెక్కించాడు.

అల్లంత దూరాన కొరిశీల వూరు కునుకు తీస్తోంది.

బండి బయల్దేరింది.

అక్కణ్ణుంచి రోడ్డు కొంత సాఫీగా వుండడంతో పోతులు కాస్తంత నిరాయాసంగా నడుస్తున్నాయి.

'మొత్తా' మీదే వెనక్కి వాలిపోయి రెప్పవాల్చేదు పారయ్య.

బుర్రనిండా ఆలోచనల్తో సిమ్మాలు ... అతని వెనుక బండీ ...

'... సావుకారి అప్పు తీరిపోతే పేనం కుదుట పడ్నెట్టు ... ఏ కూలో నాలో సేస్కోని గడిపీవొచ్చు. పార్తీపురం నుండి కారావుట్టికి కొత్తగా ఏస్తన్న రైల్ రోడ్డుకెలిపోతేసరి – పనికి నాగా వుండదు . ..' అనుకుంటూ అడుగులేస్తున్నాడు సిమ్మాలు.

కొట్టూరు దాటింది బండి.

దళాయిపేట – కళ్ళికోట లాగే కొట్టూరు–కొమరాడున్నూ. యేటికి ఎడం పక్క 'కొట్టు' కుడి పక్క 'కొమరాడ'. ఒడ్డులు మీదే వున్నాయి వూళ్ళు.

"ఒవుల్రా అది?" త్రోవప్రక్క చెట్టుక్రింద నిల్చొన్న యిద్దరు వ్యక్తుల్లో ఒకడు కేకేశాడు.

"... ... ..."

"ఒవుల్రా? నోర్లేదేటి పలకనానికి ... ఆపెస్ ... బండినావురా!" ఆ వ్యక్తే మళ్ళీ అన్నాడు.

ఇప్పడు గుర్తుపట్టాడు సిమ్మాలు ఆ గొంతుని.

అది – ఫారెస్టుగార్డు క్రిష్ణబాబుది. ఇంకో వ్యక్తి క్రిష్ణబాబుకి తోడుగా వచ్చాడు.

"నీను బావూ ... రాంబద్రపురం సిమ్మాలుని ..." బండినాపి అన్నాడు సిమ్మాలు.

"నువ్వే నేటి ... అయితే పలక్కుండ ముంగిపోతు లాగెలిపోతన్నావేటి?"

దగ్గరకొస్తూ అన్నాడు క్రిష్ణబాబు.


"నాక్కాదు గావాలని అనుకున్నాను బావ్ ..." చేతులు నులుపుకొంటూ అన్నాడు సిమ్మాలు.

"అమ్మనీయమ్మా ... నువ్వూ గడుసు నేరిస్సేవురా ... నిన్ను కాదనుకున్నావా?

ఈ సీకట్ల నువ్వూ నేనూ గాక మరెవుల్రా వున్నారు? ... అవున్లే రంకు నేరిసినమ్మ బొంకు నేర్పదా?"

"అబ్బెబ్బే నేడుబావ్ ... సత్తె పెమానికంగా ... నాకనుకోనేదు బావ్ ... నేపోతే ఆపనానికేటీ..."

"ఆ పనానికేటా? ... ఏటంతే ... ఇవిరా ...




ఇవీ ... ఏటి ఉద్దుల్నాగున్నాయి?"

"అవును బావ్ ..."

"'కల్లికోటెల్తన్నాయి గదరా?"

"అవును బావ్..."

"మరేటీ ఎరగనట్టు 'ఆపనానికేటీ' అనంతావ్ ... ఇవన్నీ బండిల ఎట్టి నువ్వెలగావుతవ్రా?!"

"అబ్బెబ్బే అది కాదు బావ్ ..."

"ఏది కాదు – ఏది కాదురా ... మల్ల మాట్లాదేవంతే కేసు కట్టేసి బొక్కల్తోయించీగల్ను ... జాగర్త – ఏసాలేత్తన్నావ్రా? .... ఒవులివిరా ఈ ఉద్దులూ?"

"అప్పల్నాయ్డు బావ్‌వి ..."

"ఆహా... నీకెంతిత్తాడ్రా నాయ్డు?"

"ఒంద రూపాయలు బావ్"

"ఆహా ... ఐతేటి కేసు కట్టీమంతావేటీ?" ఆ మాటతో సిమ్మాలు గుండెలో పిడుగులు పడ్డాయి.

"బాబ్బాబు ... అంతపని సెయ్యకండి పిల్లలుగలోడ్ని ... సరుకు బుగతోరిది – నానేటిచ్చుకోగల్ను ..." ప్రాధేయపడ్డాడు సిమ్మాలు.

"అవున్రా నువ్వేటీ యిచ్చుకోలేవుగానీ ముందు కొమరాడ పోలీస్ టేసనుకాడికి పద – బండి తిప్పు!"

"బాబ్బాబు ..."

"తిప్పెస్ ... సెప్తుంతే నీక్కాదూ ... తిప్పూ"

ఈ గొడవకి ఎప్పుడు లేచాడో ఏమో పారయ్య – నిద్రమత్తు ఎగిరిపోయి బిక్కు బిక్కుమని చూస్తున్నాడు.

క్రిష్ణబాబు మంచోడు కాదు. ఎంత పేదోడైనా ... పట్టుకెళ్తున్నది వంట చెరుకైనా పట్టుకొని కేసు కట్టేస్తానని బెదిరించి కావలసినంత డబ్బూ గుంజేస్తాడు. లేకపోతే అన్నంతపనీ చేసి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడు.

మారు మాటాడకుండా బండిని తిప్పేదు సిమ్మాలు.

"టేసునుకాడ బండుంచి నువ్వెల్లి మీ బుగతని పిల్సుకురా .. ఏటి?" అని క్రిష్ణబాబు అనేసరికి 'తప్పదు గవాల ... క్రిష్ణబాబు పట్టేడంటే ఉడుంపట్టే...' అనుకున్నాడు సిమ్మాలు.

"ఎన్నాళ్ళ నుంచి సాగుతున్నాదీ నాటకం? రోడ్డు మీంచైతే బోనులో పడ్డ ఎలకలాగ ఆవిరిపోతారనా ఈ యేటొడ్డునుంచి సెక్కేస్తన్నారు? నా కల్లు గప్పెత్తార్రా ... వక్కలెరగని బొక్కలా ...?" నోటికొచ్చింది పేలుతూ బండి వెనుక నడుస్తున్నాడు క్రిష్ణబాబు.

బండి యేట్లోకి దిగింది.

"దళాయిపేట దగ్గిట దాటాల్సిన బండి ఇక్కడె ఈ నడి వీని దాటే వాల్సొస్తంది...?" అనుకుంటూ బండిని వెనుకనుంచి నెడుతున్నాడు సిమ్మాలు.

క్రిష్ణబాబుకి తోడొచ్చిన మనిషి జరుగుతున్నదంతా మౌనంగా చూస్తున్నాడు.

"సూడ్రా! ఈ మూడు జెతల ఉద్దులూ ఎంతనుకుంతన్నావ్? ఆరుమూల్ల పద్దెనిమిదొందలు ... బండోడి సేతిల ఒందకాయిత పెట్టి మిగిలిందంతా ఆ బుగతే బుక్కేత్తాడ్రా ... మనకీయొల్సిన మామూల్లెగ్గొట్టీనానికి ఈ యేటొడ్డు నుంచి ఎలిపోతన్రు ... సూసేవా ..." అన్నాడు క్రిష్ణబాబు.

ఆ తోడు మనిషి 'ఊ' కొడుతూ నడుస్తున్నాడు.

అవతలొడ్డు ఎత్తుగా కాకుండా ఏటవాలుగా వుండడం వలన ఉద్దుల్ని దింపాల్సిన బాధ తప్పింది సిమ్మాలు – పారయ్యలకి.

దారిపొడుగునా క్రిష్ణబాబు గునుస్తునే వున్నాడు.

పోలీసు స్టేషను ముందాగింది బండి.

"ఇక నువ్వెల్లు – ఎల్లీ మీ బుగతని పిల్సుకురా ... ఇప్పడు కాపోతే రేపు ... పెందిలకడొట్టుకురా!" అన్నాడు క్రిష్ణబాబు.

"మావా! నువ్వుండ్రా! నానెల్లి పిల్సుకొత్తాను. నాయ్డు బావొత్తే మనకే సిక్కూ వుండదు ... దేనికే మంత్రవెయ్యాలో ఆ బావ్‌కే తెల్సు ... నువ్వుండ్రా!" అన్నాడు పారయ్య.

"ఊ ... అయితెల్లు ... బేగెల్లు ... నాయుడు బావ్ తొంగోనుంతాడు – జాగర్త గాంగెట్టేసినావంతె

మల్లా తోక తొక్కిన పావునాగ నెగిసిపోతాడు... మెల్లిక లేపు ... ఏటీ ... జాగర్త!" అని చెప్పి పారయ్యని పంపించేడు సిమ్మాలు.

'ఇదేటి – నాకేటీ సిక్కు?' అని విసుక్కోలేదు పారయ్య. తన సొంత పనికే చికాకు కలిగినంతలా బాధపడ్డాడు. అంత రాత్రప్పుడు ఒక్కడే ఏ భయమూ బితుకూ లేకుండా ... ఎనిమిది మైళ్ళ దూరం కాలి నడకనే బయల్దేరిపోయాడు.

సిమ్మాలు చూస్తుండగనే వెన్నెల మసక వెలుగులో మాయమైపోయాడు.

పోలీసు స్టేషను కెదురుగా కానుగచెట్టు కింద బండినాపి పోతుల్నిప్పి చెట్టుకు కట్టాడు సిమ్మాలు. ఆ ప్రక్కనే వున్న కల్లం నుంచి వాళ్ళనడికి నాలుగు గడ్డి పరకలు తెచ్చిపోతులకేశాడు. చుట్టతీసి ముట్టించి బండి మొకర మీద వెనక్కి వాలి చేరబడ్డాడు.

సిమ్మాలుకి ఆకాశం నిండా చుక్కలు పల్లేరు కాయల్లా కనిపిస్తున్నాయి. చూస్తూ లోలోపలే గొణుక్కున్నాడు.

'పద్దెనిమిదొందల సరుకు ... బుగత ఎలాగో సేస్సీ ... ఏదో సెప్పేసి యిడిపించుకోడా? అతగాడి మాట కిష్టబాబినా పోతే ఎమ్మెల్లేగోరి దగ్గిరకెల్లేటి? ఎమ్మెల్లే ఒక్క పోను కొట్టేడంతే ఈలేటి – ఈల్ల తల్లో పేని గూడా బుర్రూపుతాది. అప్పుడిదాకా ఈ కౌకుల్తప్పదు' చుట్ట పొగ వదుల్తూ ఆలోచిస్తున్నాడు సిమ్మాలు.

'ఈ పాలికెలాగో ఒడ్డెక్కిపోతే ... మల్లా ఇంకో పాలి దొంగతనంగా తిరిగితే ఆ సావుకారి బాకీ యిరిగిపోద్ది. అప్పడింక గడ్డి కరుస్తానా? నా తిప్పలేవో నాను పడతాను గానీ ... కోరీ కాడ ఒల్లొంచి రాల్లు కొట్టుకున్న డబ్బుల్పాలు – యింటిల్లపాదిలీ బతికీనానికి. మాకేటి కావాల – గెంజిమెతుకులే కదా .... మెల్లికెలాగో సేస్సి ఈ యేడాదైనా జాకర్తగ యవసాయం సేసుకుంతే మల్లా తిరుగుంతాదా?!"

క్రిష్ణబాబు హెడ్ కానిస్టేబుల్‌తో ఏదో మాట్లాడుతున్నాడు.

ఇద్దరూ స్టేషన్ బయటికి బెంచీ లాగి దానిమీద కూచున్నారు.

హెడ్ కానిస్టేబుల్ మరో కానిస్టేబుల్‌ని కేకేసి ఫ్లాస్కు తెప్పించాడు. అందులోని టీని రెండు కప్పుల్లో పోసి ఒకటి క్రిష్ణబాబుకిచ్చాడు.

ఆ అలికిడంతా సిమ్మాలుకి కనిపిస్తూనే వుంది. అలా చూస్తుండగానే కునుకు పట్టేసింది.

* * *

"మావా! ... మావా!" పారయ్య పిలుపుతో తెలివొచ్చింది సిమ్మాలుకి. తుళ్ళిపడి లేచాడు.

"ఏట్రా .. ఏటింత బేగెలిపొచ్చీసేవు ...?" కళ్ళు నులుముకుంటు అడిగేడు సిమ్మాలు.

"బేగేటి? నీను సోల పదంల బైలుదేలీతలికి మూడయ్యింది.



ఇదింకా ఎన్నెలే అనుకుంతన్నావేటీ ... అది గదా అటు సూడు తూరుపొంక! తెలతెల్లగ వుతున్నాదా నేదా?" అన్నాడు పారయ్య – సిమ్మాలు ఇంకా నిద్రమత్తులోనే వున్నాడని అసలు విషయంలో రాకుండా.

"ఏటన్నాడ్రా బుగత? పొద్దున్నే తానం సేస్సీ వొత్తానన్నాడా?" తూర్పు దెస తేరిపార చూసి అడిగేడు సిమ్మాలు.

"తానం నేదూ గీనం నేదూ ... ఆడూ మడిసేన్రా థూ ..." అని వూసేడు పారయ్య.

"ఏట్రా ... ఏటలగంతావ్ ... ఏటయ్యింద్రా ...." గాబరాపడ్డాడు సిమ్మాలు.

"ఈ వుద్దులాడివి కావట.. ఆడికీ ఈ సరుక్కీ ఏ సమ్మందవూ నేదట ఎల్లెల్లమన్నాడు నంచికొడుకు"

సిమ్మాలు గుండె గుభేలుమంది.

"... అలపింటోణ్ణి నమ్ముకున్నావేట్రా మావా?! పావునాగ రొండు నాలికలాడిని ... యిప్పుడు సూడు నడివి మద్దిసిరికిపోనావ్..."

సిమ్మాలు కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

అప్పల్నాయుడు మీద పీకలదాకా కోపమొచ్చింది.

'జౌను బుగతకేటి పోనాది? పోతే ఉద్దెమ్మిదొందల్నాబం పోనాది... మదుపా మరమ్మిత్తా ... సేతి డబ్బులెట్టేడేటి? సరుకొదిలిత్తే నట్టవేటి ...' అనుకున్నాడు సిమ్మాలు.

'... అడివిల దొంగతనంగా కలప కొట్టించి, కొట్టనానికో ఒంద, తేనానికో వంద .. ఇదా ఇప్పడిలాగ ఒట్టుకెల్నానికో ఒంద ... మూడొందలు పోతే పదేనొందల్నాబం ... అందల నాలుగైదొందలు పారెస్టుగారుడికి నంచమిత్తాడట. పోనీ అలాగిచ్చిత్తే ఏ సిక్కూ నేకపోను ... ఇవ్వాపోబట్టే గదా ఈ సిక్కంతానూ...'

'... ఇప్పడు సూడు – సరుకాడిది కాదంట ... ఇలాగ బొంకేసి తప్పించేసుకుందువని గవాల – నాకేటి పోనాది ... సరుకా గారుడు కొదిలీసి నానింటికెలిపోతాను. నా ఒంద నాకు దక్కింది గదా ...' అనుకున్నాడు.

"ఓరేటి సేస్తున్నార్రా ..." క్రిష్ణబాబు స్టేషను పక్కనే వున్న టీ పాకలో నుంచి కేకేశాడు.

"ఏట్నేదు బావ్ ... ఇదిగిదా ఒత్తన్నాం ..." అంటూ యిద్దరూ పాక్కాడికెళ్ళారు.

టీకొట్టు ముత్తేలు పొయ్యి మీద ఇడ్లీ పెట్టి పొయ్యికాడ కూచుంది. అక్కడున్న బల్లమీద కూచొని టీ తాగుతున్నాడు క్రిష్ణబాబు.

"ఏడ్రా మీ బుగత? – ఒత్తానన్నాడా?"

"నేదు బావ్, ఏదో అరిజంటు పనిమీద ఒవుల్దో జీపొత్తే రాయిగడెల్లి పోతన్నాడట. మా పోరిగాణ్ణి సూసి యివరవడిగి 'రొండ్రోజుల్లో తిరిగొత్తాను – సరుకుంచుమని సెప్ప కిస్నబావుకి' అని సెప్పేడట బావూ బుగత ..." అన్నాడు సిమ్మాలు.

"జౌనౌ్రనా ... నాకు తెలీని యవ్వారవేటి – మా మామ్మోల్లు మా కియ్యకుండ దొంగతనంగా కలప నడిపించీసినప్పడే అనుకున్నాను యిలపింటి పితలాటకం ఎడతాడని ... ఓరె సిమ్మాలూ! ఆడు మర్రాడురా! కేసు కట్టెత్తావని బెంగపడిపోంద్రా..." అన్నాడు క్రిష్ణబాబు.

"ఐతేటంతావ్ బావ్ – మాం ఎలిపోదువా?" అన్నాడు సిమ్మాలు.

"నువ్వెక్కడి కెలిపోతావ్ రా .. ఉందు పారాల మీద ఏలిముద్ర లెదుదువ్‌గానీ ... ఎట్టేసేక నీ పోతులు నువ్వు తోలుకెలిపో!"

"పోతులేటి బావ్ ... బండో మరి?"

"ఓర్రెరి నాగన్నా! ఏటి ఎరగనట్టి గదుగుతావేట్రా ... కేసు కట్నావంటే సరుకుతో బాటు బండీ ఇక్కడే వుండిపోద్ది. సరుకు దొంగతనంగా రవాణా సేస్తున్నెందికి నీకు పైను పడతాది. అది నువ్వు కట్టేసేకే నీ బండీ నీ సరుకూ నీకొత్తాయి ..."

"సరుకు నాది కాదు గద బావ్ ..." అడిగేడు అమాయకంగా సిమ్మాలు.

ఆ మాటకు ఎగతాళిగా ఓ నవ్వు నవ్వేడు సిమ్మాలు.

"సరుకు నీది కాపోయినా బండి తోల్నోడి మీదె కేసు కట్టాల్రా ..." సిమ్మాలుకి కళ్ళు తిరిగినంత పనయింది.

"పైనెంత కట్టాలి బావ్?" పారయ్య అడిగేడు.

"ఎంతేటి? సరుకుని బట్టే వుంతాది... మూడ్నాలుగేలుండొచ్చు ..."

సిమ్మాలు అమాంతంగా గార్డు కాళ్ళ మీద పడిపోయాడు.

"బావూ! తప్పయిపోనాది. నాకు తెలీక కక్కుర్తిపడిపోన్ను ... ఇలాగ విరిపోతాననుకోనేదు. నన్ను తవరే కాపాడాల ... కనికరించండి బావ్ ..." సిమ్మాలు కళ్ళలోంచి నీటి బొట్లు రాలి

పడ్డాయి.

"నన్నేటి సెయ్యమంటావ్‌రా ... ఉప్పద్దానేటీ సెయ్యలేను ..."

సిమ్మాలు రొండిని దోపిన వంద కాగితం పైకి తీశాడు.

"ఇదా! నాకా బుగతిచ్చిన ఒంద ... తవరిది తీసేస్కోని నా బండీ బక్కలూ ఒదిలీండి బాబ్ ..." అన్నాడు సిమ్మాలు.

"ఏనుగుకి ఎలంకాయ లొటలొటా అని ఇదేటి ఒందా? అవున్లే ఈడి దగ్గిటేటుంటాది గోసి పాత్తప్ప ... కేసు కట్టిత్తే సరుకు పట్టీసేనని పేపర్లో పేరైనా పడతాది ... గుర్తింపుంతాది ..." అని లోలోపలే అనుకుని –

"నాకేల్రా నీ ఒంద? నీ కదుపు కొట్టీసే వోల్లా గవుపడతన్నాన్నేట్రా నేను? ఛ ఛ. నీ మీద నాకేటి కోపం ... మా కల్లు గప్పెత్తండని మీ బుగత మీద మా కోపంగాని ... కలప దొంగతనంగా ఎలిపోతోందని మా ఆఫీసుకి ఇన్‌పర్మేసనొచ్చింది ... అంతా మా ఆపీస రికీ తెల్సిపోయింది ... ఇప్పడీ బండినానొదిలీసేనంతే నా ఉజ్జోగం ఊడిపోద్దిరా ..." అన్నాడు క్రిష్ణబాబు.

"బాబ్బాబు ..." చేతులు జోడించాడు సిమ్మాలు.

"అమమ్మా ... నమ్మవేట్రా ... ఇదా ఈటి మీద ఏలి ముద్రలేసీ ... తర్వాత సూసుకుందుంగానీ ..." చంకమున్న చిన్న లెదర్‌బేగ్ లోంచి తీసిన కాగితాలు చూపించాడు క్రిష్ణబాబు.

"ఒరె మావా! అటు సూడు మీ ... ఎలపల పోతు కింద బడి ఎలాగ కొట్టుకుంతందో ..." అన్నాడు పారయ్య.

ఆ మాట విని పోతుల వైపు పరుగెత్తాడు సిమ్మాలు. ఆ వెనుకే పారయ్యన్నూ.

ఆ పోతు నాలుక బైట పెట్టి ఇవరగరచి గుడ్లు తేలేసింది. కొట్టుకోడానిక్యూడా శక్తిలేనట్టు కాళ్ళను అటూ యిటూ నెమ్మదిగా కూడదీసుకుంటూ చివరికి ఆగిపోయింది.

"ఓర్నాయనో ... ఓర్నాయనో ... ఈ పోతి లాగ సచ్చిపోనాది ... ఆ బండలాగ ఇరికిపోనాది ... నానేటి సేత్నురా దేవుడో" అని సిమ్మాలు గుండెలు బాదుకున్నాడు.

దాపలపోతు కుడికాలుని పైకెత్తి దించుతూ చచ్చిన పోతుని బెరుకు బెరుగ్గా చూస్తో నిల్చొంది.

సిమ్మాలుని ఓదార్చలేక – చేసేది లేక కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు పారయ్య.

"ఏట్రా సిమ్మాలూ! పోతు సచ్చిపోయిందేట్రా – చ్ ... చొ ... లెగూ! మనిసన్నాక పాట్లు తప్పవ్‌రా ... ఏటి సేస్తాం సెప్మే ... లెగూ ఈ పారాల మీద ఏలిముద్రలెట్టు!" సిమ్మాలు ఎడమ చేతి బొటన వేలుని ఇంక్‌పాడ్ మీద అద్ది పారాల మీద ఒత్తాడు క్రిష్ణబాబు.



అభ్యుదయ, విప్లవ కవులు చిన్నప్పుడు పద్య కవిత్వం రాయడం పెద్ద ఆశ్చర్యకరమైన విషయం కాదు. ఆ మాటకొస్తే పద్య కవిత్వంలో ఆరితేరిన తర్వాతే ఆధునిక కవిత్వాన్ని మలుపు తిప్పగలిగారని కూడా చెప్పవచ్చు. శ్రీశ్రీ 'ప్రతిభ' పద్య కవిత్వంతోనే ప్రారంభమైంది. అయితే, శ్రీశ్రీ అప్పుడు జంట కవిత్వం రాశారా? అనే సందేహానికి పాత 'భారతి'లోని 'వేణుగానము' అనే కవిత అవకాశమిస్తోంది. కేతవరపు కృష్ణమూర్తిగారితో కలిసి రాసిన ఈ వేణుగానాన్ని ఆలకించండి — కేతవరపు కృష్ణమూర్తి గారి గురించి ఆరాతీయండి.

ద్వా.నా. శాస్త్రి

## వేణుగానము

అంధకారము దిక్కుల నంతరించె
మెల్లమెల్లన తెల్లన వెల్లువయ్యె;
అంతలోపల జగమంత హ్లాదపరత
నలర ప్రకృతి సితస్మేర లలితమయ్యె.

గూడులన్ వీడి తమవారితోడ గూడి
చివురుగొమ్మలపై మహోత్సవముగాగ,
వీనులకు విందుగాగ సుధానవమగు
గానవర్షము వీడ జగణము కురిసె.

అంతవర కచేతనముగ నణగియున్న
విశ్వమందు చైతన్యమ్ము వెల్లివిరిసె;
చేతన పదార్థములు కాంతిచే వెలింగె;
కాంతికల్లోలినులు ధాత్రి గడలు కొనియె.

పాలకైవిడి, లేగలు పరువులెత్తి
తల్లి పొదుగుల బొడుచుచు ద్రావె బాలు
చలిది బువ్వలు భుజియించి సంగడీండ్ర
బిలువసాగిరి గొల్లల పిల్లలపుడు.

బాలసవమందు ముందుగా బరువులెత్త
బట్టగా బోవగా నలె బల్లటీల
గొట్టుచు బోవగా సాగె గోమలంపు
జివ్వి కెరటాలు యమునలో జెమ్ము మిగిలి.

యమున యొద్దున దూరాన నచ్చటచట
బచ్చికలు నిండిపోయిన బయలులందు
గోవులను, లేగదూడల గొనుచు వెంట
గోపబాలురెందరో మేపుకొ దిరిగిరి.

వారిలో నొక బాలుడు వన్నెకాడు,
నీలనీరదంపంకాశనిస్తులాంగు
డమల శుభ లక్షణాన్వితు డమృత మధుర
మందహాసనుడు, కాంతి మహితమూర్తి.

ఒక మనోహర వేణువు నూదె నతడు
చేతనాచేతన సమగ్ర సృష్టియులికి
మారుమ్రోత లొసర్చుచు మరల మరల
మధుర మధుర గీతానందమయము గాగ.

ఆ మసృణ గాన మాధుర్య మమరగీతి
కా కళామధురిమల నిరాకరించు
పారలు నచటి గాన స్వాదు ఝురమునందు
భువనములు లవమ్ములుగనై పొరలిపోవు.

కానన విహంగమా! నీదు గానరవలి
మాని, దట్టంపుటాకుల మ్రానిచివురు
లాని, మౌగ్ధ్యమ్ముపూని యే మాలకింతు
మేమి యానంద మెంత వహించినావు?

ఓ తమాలశాఖిక! యమునా తరంగ
నాట్యమూర్తి! మీ కెంత యానంద మిపుడు!
లేగలావులు, గోపకు లీ గభీర
గానమున మానసిక మూర్చ గనిరొ యేమొ?

వేణుగళ నిర్గళ న్మృదు గానరవలి
నమరు లాలకించిరి గగనాంగణాన,
ప్రకృతి ప్రతిమగనై విని పరవశాన,
భువనములు మారె నందనమ్ములుగ నపుడు.

శ్రీరంగం శ్రీనివాసరావు,
కేతవరపు కృష్ణమూర్తిగార్లు